క్లుప్తంగా

పార్వతీపురంలో హౌసింగ్ లోన్‌మేళా



హౌసింగ్‌లోన్ మేళాలో పాల్గొన్న రీజినల్ అడ్వాన్స్ మేనేజర్ సోమేశ్వరరావు

పార్వతీపురంటౌన్: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంట్ కాలేజీ గ్రౌండ్‌లో ఆదివారం రీజినల్ అడ్వాన్స్ మేనేజర్ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఏపీజీవీబీ హౌసింగ్‌లోన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ లోన్ రేట్ ఆఫ్ ఇంటరెస్ట్ 8.30% నుంచి ప్రారంభమవుతుందని, అలాగే 30 సెప్టెంబర్ 2023 వరకు హౌసింగ్ లోన్‌పైన ప్రాసెసింగ్ చార్జెస్ ఉండవని తెలిపారు. వికాస్ హెల్త్ కేర్, ఎంఎస్ఎంఈ లోన్స్, గోల్డ్ లోన్స్, అలాగే డిపాజిట్స్ అత్యధిక వడ్డీ రేట్ 7.75% కల్పించే బ్యాంకు ఏపీజీవీబీ అని తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ పార్వతీపురం బ్రాంచ్ మేనేజర్ కృష్ణసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

98 ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శంకర్రావు



శంకర్రావు

పార్వతీపురం టౌన్: 1998 డీఎస్సీ ఉపాధ్యాయుల సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడిగా పూడి శంకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పింఛన్ దారుల సంఘం భవనంలో 1998 డీఎస్సీ టీచర్ల జిల్లా సమావేశం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ సలహాదారు బి.ఉమా కామేశ్వరరావు అధ్యక్షతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడిగా పూడి శంకరరావు, ప్రధాన కార్యదర్శిగా జీవీడీ దామోదరప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఆర్‌వీ ప్రసాద్, తవిటినాయుడు, జాయింట్ సెక్రటరీగా ఎస్. కోటేశ్వరరావు, కొల్లి రామకృష్ణ, కోశాధికారిగా జి.రామచంద్రన్, అదనపు కోశాధికారిగా సీహెచ్ రవీంద్రలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు జిల్లాలోని పలు మండలాలకు చెందిన 14మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ప్రమాద ఘటనపై కేసు నమోదు

పాలకొండ రూరల్: మండలంలోని గోపాలపురం రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ఘటనకు సంబంధించి, పిన్నింటి రవి రాజా అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శివప్రసాద్ ఆదివారం తెలిపారు. కొత్తూరు మండలం, కర్లెమ్మ గ్రామానికి చెందిన రవిరాజా తన కారులో స్వగ్రామం వెళ్తూ మండలంలోని గోపాలపురం రోడ్డుపై నడుస్తూ వెళ్తున్న పాలకొండ పట్టణం కస్పా వీధికి చెందిన రఘు అనే వ్యక్తిని ప్రమాదవశాత్తు ఢీకొన్నాడు. దీంతో పాదచారుడికి(రఘు) గాయాలయ్యాయి. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

గిరిశిఖర గ్రామంలో సేవా కార్యక్రమాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పెదఖర్జ పంచాయతీ, గోరటి అనే గిరి శిఖర గ్రామంలో రాఫ ఫౌండేషన్, మధుశ్రీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత నిర్వహించిన వైద్య శిబిరంలో 100 మంది గిరిజనులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వస్త్రదానం చేపట్టి, మహిళలకు చీరలు, పురుషులకు పంచెలు, షర్టులు అందజేశారు. కార్యక్రమంలో మధుశ్రీ హెల్త్ కేర్ క్లినిక్ వైద్యాధికారి రవికుమార్, రాఫ ఫౌండేషన్ డైరెక్టర్ ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు విడుదల

రాజాం: మండలంలోని తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు విడుదలైంది. దీంతో కంచరాం, చీకటిపేట, బొద్దాం తదితర గ్రామాల ఆయకట్టు రైతులు ఈ నీటి సాయంతో వరినాట్లు వేయడం ప్రారంభించేశారు. అడపాదడపా వర్షాలు కూడా కురుస్తుండడంతో అన్నిచోట్ల ఖరీఫ్ పనులు కూడా ఊపందుకున్నాయి.

మానవ అక్రమ రవాణా తగదు

బొబ్బిలి: మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని రైల్వే పోలీస్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, వైసీబీ నెట్‌వర్క్‌లు ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రజలకు రైల్వే పోలీసులు, స్థానిక అధికారులు అవగాహన కల్పించారు. ఎస్సైకులు, ఏఎస్సై వైకే రావు, వి.లక్ష్మీనారాయణ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఇన్‌చార్జ్ ఎం. వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

రాజాం: స్థానిక పట్టణంలోని మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన ఆర్టీసీ కండక్టర్ యందవ కురమమ్మ కుటుంబాన్ని ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదివారం కలిసి, పరామర్శించారు. గుండెపోటుతో ఆమె మృతి చెందగా, తల్లి మరణ వార్త విని కుమారుడు యందవ అమర్ కూడా చనిపోయిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యే కుమరమ్మ తల్లి కమలమ్మ, ఆమె చిన్న కుమారుడు జీవన్‌ను కలిసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. తల్లీకొడుకుల మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు ఉన్నారు.

అవినీతి రహితంగా సంక్షేమం

- ఎమ్మెల్యే జోగారావు



చిలకలపల్లిలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలను అవినీతి రహితంగా అందిస్తున్నారని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని చిలకలపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటప్రకారం క్రమం తప్పకుండా తేదీల వారీగా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా జమచేస్తూ అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వం చేస్తోందన్నారు. గత ప్రభుత్వం హయాంలో సంక్షేమం అంటేనే అవినీతిమయంగా ఉండేదని ఆరోపించారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని స్పష్టం చేశారు. నాయకుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుకు పథకాలు అందుతున్నాయని చెప్పారు. ప్రతి ఇంటా సంక్షేమాల పంట పండుతోందన్నారు. గడపగడపలో లబ్ధిదారులను కలిసినప్పుడు బుక్‌లెట్‌లో ఉండే పథకాలు అందాయా లేదా అనేది ప్రశ్నించి ఇంకా మీ ఇంట్లో అర్హత ఉండి పథకాలకు దూరంగా ఉన్నవారు ఉన్నారా అని తెలుసుకుంటూ ఇన్ని పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి గెలిపించుకోవాలని కోరారు.



రక్షిత మంచినీటి పథకం ట్యాంకును ప్రారంభించిన ఎమ్మెల్యే

రక్షిత మంచినీటి పథకం ట్యాంకు ప్రారంభం

గ్రామంలోని పాకలవీధిలో రూ.15లక్షలతో నూతనంగా నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ఎమ్మెల్యే జోగారావు ప్రారంభించారు. పాలకవీధిలో ఇంటింటి కొళాయి పథకం ద్వారా తాగునీరు సరఫరా ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, ఎంపీటీసీ మల్లిక, ఏఓ భానుమూర్తి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, టి.ప్రసాద్, జగన్నాథం మాస్టారు, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు జి.శ్రీరాములునాయుడు, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కె.మోహనరావు, ఎన్.పాపారావు, జి.జగన్, ఎం.శ్రీనివాసరావు, జి.లక్ష్మణరావు, జ్యోతీష్, శంకరరావు, జి.సత్యం నాయుడు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అన్యాయం



లచ్చయ్యపేటలో ప్రచారయాత్ర చేస్తున్న మహిళా సంఘాలు

సీతానగరం: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు అన్యాయమని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా ఆగస్టు 9వ తేదీన విజయవాడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ లచ్చయ్యపేటలో ఆదివారం ప్రచారయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలపై దాడులు, లైంగిక వేధింపులు దారుణంగా ఉన్నాయని వాటిని ప్రభుత్వాలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. దాడులకు నిరసనగా నిర్వహించనున్న బహిరంగా సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మన్యం జిల్లా ఐద్వా అధ్యక్షురాలు వి.రామలక్ష్మి, ఇ.పార్వతి, టి.లక్ష్మి, ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భగవన్నామస్మరణతో మోక్షం

రేగిడి: భగవన్నామస్మరణతోనే మోక్షం సాధ్యమవుతుందని రేగిడి దత్తపీఠం ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యన్నారాయణనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక దత్తపీఠంలో నిర్వహించిన ఆధ్యాత్మిక సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భగవంతుడిని నిత్యం స్మరించుకోవాలని, అలా చేస్తే మనసు ప్రశాంతతతో పాటు దుఃఖాలు దరిచేరవన్నారు. దైనందిన జీవితంలో ప్రతిఒక్కరూ కొంతసమయం ఆధ్యాత్మికంగా గడిపితే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో రేగిడి దత్తపీఠం కన్వీనర్ శ్రీనివాసరావు మాస్టారు పాల్గొన్నారు.

ఘనంగా దేశమ్మ తల్లి వారాలు

రామభద్రపురం: మండలంలోని పలు గ్రామాలలో దేశమ్మ తల్లి వారాలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. రామభద్రపురం, ఇట్లామామిడిపల్లి, తదితర గ్రామాల్లో మహిళలు ముగ్రాటలతో బయలుదేరగా.. యువత మేళతాళాల నడుమ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పంటలు బాగా పండి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు చెప్పారు.

వరిలో కాలిబాటలు తప్పనిసరి

సంతకవిటి: వరి సాగు చేసే రైతులు పంటలో కాలిబాటలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి పైల నవీన్ తెలిపారు. యాజమాన్య పద్ధతుల్లో భాగంగా ఊబాలు వేసిన 10 నుంచి 15 రోజుల్లోపు కాలిబాటలు ఏర్పర్చుకోవడం మంచిదన్నారు. ప్రతీ రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటలను గాలివాటంగా తీయాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి, పంట ఏపుగా పెరుగుతుందన్నారు. అలాగే వరి దుబ్బులకు ఎరువు సక్రమంగా సరఫరా అవుతుందన్నారు.

శరవేగంగా కోనేరు సుందరీకరణ పనులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామ కోనేరు సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కోనేరు చుట్టూ ప్రస్తుతం గోడ నిర్మాణం పనులు చకచకా సాగుతున్నాయి. గ్రామస్తుల సహకారంతో ఈ పనులు జరుగుతున్నాయని, గోడ నిర్మా ణం అనంతరం చెరువు అంచులో మొక్కలు నాటడం, గట్టును వాకింగ్ ట్రాక్‌గా మలచడం వంటి పనులు చేపడతామని గ్రామ యువత తెలిపింది. దాతలు విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వస్తే మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



దంగులగూడలో చోడినారు కట్టలు కడుతున్న వ్యవసాయ కూలీలు

కురుపాం: అడపాదడపా కురుస్తున్న వర్షాలతో అన్నిచోట్ల వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కురుపాం మండలం, ఒబ్బంగి పంచాయతీ, దంగులగూడ గ్రామంలోని గిరిజన రైతులు చోడినారు కట్టలు కట్టే పనిలో బిజీగా ఉన్నారు. అలాగే టేకరఖండి గిరిజన గ్రామంలో కూడా వరుస పద్ధతిలో పత్తి విత్తనాలు నాటడంలో అక్కడి రైతులు నిమగ్నమయ్యారు. ఈ దృశ్యాలు ఆదివారం 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.



టేకరఖండిలో వరుస పద్ధతిలో పత్తి విత్తనాలు వేస్తున్న గిరిజన రైతులు

తోటపల్లి కాలువల ఆధునికీకరణపై

ఆరోపణలు తగవు

- టీడీపీ నేతల ఆరోపణలపై ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మండిపాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పక్కనే నగర పంచాయతీ చైర్మన్ రాధాకుమారి, పార్టీ నాయకులు

వీరఘట్టం/పాలకొండ: తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునీకరణ పనులపై టీడీపీ నేతలు చేసిన ఆరోపణలపై ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మండిపడ్డారు. ఆదివారం పాలకొండ పట్టణంలోని తన నివాస గృహంలో మీడియాతో మాట్లాడిన ఆయన తోటపల్లి కాలువల అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగిందంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్న టీడీపీ నాయకుడు జయకృష్ణ నిజాలు తెలుసుకుని, మాట్లాడాలని హితవు పలికారు. ఈ కాలువల ఆధునీకరణకు 2009లోనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారని, ఆయన మరణానంతరం ఆ పనులు మరుగునపడ్డాయన్నారు. ఆ తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునీకరణకు ఏనాడూ ముందుకు రాలేదన్నారు. 2019 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆదరాబాదరాగా వీరఘట్టం మండలంలోని అచ్చెపువలస వద్ద కాలువల అభివృద్ధికి మొక్కుబడిగా శంకుస్థాపన చేపట్టి, రైతులను మోసగించింది మీ పార్టీ (టీడీపీ) కాదా అని ప్రశ్నించారు. టీడీపీ పాలనలో విసిగిపోవడంతోనే ప్రజలు 2019లో వైఎస్సార్ సీపీ పట్టంగట్టారన్న విషయం ఆ పార్టీ నేతలు గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. 2019లో టీడీపీ హయాంలో కాలువల పనులు ఆగిపోయిన విషయం, రైతులు పడే ఇబ్బందులను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, పాలకొండ, రాజాం ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులుతో కలిసి తాను కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువెళ్లి, పనులకు రూ.193.58 కోట్ల నిధులు మంజూరు చేయించామన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తోటపల్లి కాలువల ఆధునీకరణ పనులపై దృష్టి సారించిందన్నారు. 37.536 కిలోమీటర్ల పొడవున్న ఎడమ కాలువలో ఇంతవరకు 16.843 కిలోమీటర్ల వరకు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని, 17.616 కిలోమీటర్ల పొడవున్న కుడికాలువలో 9.376 కిలోమీటర్ల వరకు కాంక్రీట్ పనులు చేపట్టామన్నారు.

జయకృష్ణ స్వగ్రామంలో డబుల్ రోడ్ బ్రిడ్జి..

జయకృష్ణ స్వగ్రామమైన ఎం.రాజపురం వద్ద ఎడమ కాలువ వద్ద ఉన్న పాతబ్రిడ్జిని తొలగించి, డబుల్ రోడ్డు బ్రిడ్జిని నిర్మించామని, ఈ విషయాలను ఆయన తెలుసుకోవాలన్నారు. గతంలో టీడీపీ పాలనలో నీరు–చెట్టు పథకం పేరిట మీరు ఎంతెంత దోచుకున్నారో అందరికీ తెలిసిన విషయమేనన్నారు. పాలకొండ నగరపంచాయతీలో ప్రధానంగా ఉన్న డంపింగ్‌యార్డ్ సమస్య పరిష్కారానికి మేము చర్యలు చేపడుతుంటే, మీరు(టీడీపీ నాయకులు) అడ్డంకులు సృష్టిస్తున్నది వాస్తవం కాదా ధ్వజమెత్తారు. వీలైతే ప్రజాసమస్యల పరిష్కారంలో సహకరించి, ప్రజల్లో మంచిపేరు తెచ్చుకోవాలని, అలా అయితేనే రాజకీయ భవిష్యత్ ఉంటుందన్నారు. నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాల నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. మరోసారి ఇలానే తప్పుడు మాటలు మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో నగరపంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి, వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, పాలకొండ వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాశరావు, వాకముడి అనీల్‌కుమార్, మండల జేఏసీ కన్వీనర్ కోట అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటరు జాబితా సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- బీఎల్ఓలు, అధికారులకు సహకరించండి
- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: కచ్చితమైన ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు బీఎల్ఓలు, అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని తన గృహంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బీఎల్ఓలు తిరుగుతూ ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్న అంశంపై చర్చించి, సర్వే తీరుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అనర్హుల ఓటు ఒక్కటి ఉన్నా, అర్హులైన వారి ఓటు ఒక్కటి తొలగినా సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. దీనిపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, చట్టప్రకారం ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. గిరిజన గ్రామాల్లో ప్రజలకు ఇంటి నంబర్ల గురించి అవగాహన లేదన్నారు. కావున ఆ ఇళ్లలో ఓటు నమోదు చేసే అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వివాహమై వెళ్లిపోయినప్పటికీ ఇంకా కొందరి ఓట్లు తొలగించడం లేదని పలువురు నాయకులు తెలపగా, వారికి వివాహమై ఎన్ని సంవత్సరాలవుతోంది? వారు ప్రస్తుతం ఎక్కడ నివాసముంటున్నారు? వారి ఆధార్ ఎక్కడ ఉంది? తదితర వివరాలను అధికారులకు తెలియజేయాలని రాజన్నదొర సూచించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో ముందంజలో సాలూరు

అభివృద్ధి పనుల మంజూరులో పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు ముందంజలో ఉందని రాజన్నదొర అన్నారు. మండలంలో మంజూరైన పనులు, వాటి ప్రగతి తదితర అంశాలపై ఆరా తీశారు. గడపగడపకు మనప్రభుత్వం ద్వారా మరిన్ని పనులు మంజూరవుతున్నాయని, బిల్లులచెల్లింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నాయకులు గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధి అంశాల్లో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులందరూ సమన్వయంతో సమష్టిగా వెళ్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు.

చురుగ్గా ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు



పనులను పరిశీలించిన ఏఈ పవన్‌కుమార్

సీతానగరం: మండలంలోని పణుకుపేటలో రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్‌ట్యాంక్ పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ పవన్‌కుమార్ తెలిపారు. ఇంటింటికి కుళాయిల పథకం ద్వారా గ్రామంలో పనులు పూర్తి కావస్తుండడంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ మేరకు మాట్లాడుతూ రూ. 89 లక్షలతో నిడగల్లులో జరుగుతున్న ఇంటింటి కుళాయిల పనులు పూర్తి కావస్తున్నందున తొలివిడతగా 50 పాయింట్‌లకు తాగునీరు విడుదల చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బంకురు పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీహరినాయుడు పాల్గొన్నారు.

జీఓ 110 ప్రకారం వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గారావు

గరుగుబిల్లి: ఆలయాల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులకు జీఓ 110 ప్రకారం వేతనాలు చెల్లించాలని నాయీబ్రాహ్మణుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.వి.దుర్గారావు కోరారు. ఇదే విషయమై మండలంలోని తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన కల్యాణ కట్టలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులకు సంబంధించి, ప్రభుత్వం విడుదల చేసిన జీఓలో 100 రోజుల పాటు పని కల్పించాలని, టికెట్ రేటు రూ.40 వసూలు చేయాలని, రూ.20 వేల వేతనం చెల్లించాలని ఉందని పేర్కొన్నారు. ఆయితే ఇక్కడి ఆలయంలో పనిచేస్తున్న వారికి మాత్రం అధికారులు జీఓ ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని, దీనిపై అడిగినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జీఓ 110ను అమలు చేయాలని లేకపోతే ఎండోమెంట్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీహెచ్ గౌరీశంకరరావు, ఎ.శ్రీనివాసరావు, డి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ రూరల్: అంకితభావంతో పనిచేయాలని పోలీసులకు పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు సూచించారు. ఆదివారం రాత్రి స్థానిక పట్టణంలో గస్తీ కాస్తున్న పోలీస్ సిబ్బంది విధుల తీరును పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. తరచూ నేరాలు, ప్రమాదాలు సంభవిస్తున్న కూడళ్లపై ప్రత్యేకదృష్టి సారించాలని తెలిపారు. రాత్రిపూట బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వాహనాలను ఆపి, వివరాలు క్షుణ్నంగా పరిశీలించి, వివరాలు సరిగా ఉంటేనే వాటిని ముందుకు పంపించాలన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఆదివాసీ హక్కుల వేదిక నాయకుడు లక్ష్మణమూర్తి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆదివాసీ హక్కుల వేదిక నాయకుడు కోలక లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. ఇదే విషయమై స్థానిక గిరిజన సంఘ కార్యాలయంలో వివిధ ఆదివాసీ సంఘాల నాయకులతో ఆదివారం సమావేశమైన ఆయన ఆగస్టు 9వ తేదీన సెలవుదినంగా ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని మోదీ సర్కారు ఆదివాసీలకు రక్షణ కల్పించడం లేదని ఆరోపించారు. మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీలపై జరుగుతున్న దాడులే దీనికి నిదర్శమన్నారు. సామాన్యుడి పక్షాన నిలబడని బీజేపీని సాగనంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు కోలక అవినాష్, పువ్వల సత్యనారాయణ, టి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎరువుల పంపిణీ

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు యూరియా, డీఏపీ వంటి ఎరువులను రాయితీపై గ్రామ వ్యవసాయ సహాయకులు అమిత్ పాడి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎరువులు అవసరమైన రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ తీసుకుని రావాలన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.